## 12

# బతుకు ఫ్యాను

గాలికి మెల్లగా కదుల్తోంది కేలండరు. ఊయల లాగా హాయిగా పైకి లేచి, ఠప్పున పడిపోతోంది. ఒక్కొక్కసారి తల నేలకేసి బాదుకున్నట్లు—గోడకు ఠపఠపా కొట్టుకుంటోంది. ఈ బతుక్కి రోజులకూ ఏమీ అర్థం లేదన్నట్లుగా కేలండరుమీది డేట్లన్నీ పడి తిరిగి ముడతలు పడుతున్నాయి.

వేసవి వడగాడ్పు చిరాకుగా వుంది. గదికిపైన కప్పిన యినుప రేకుల్లోంచి అగ్గికురుస్తోంది. విశ్రాంతిలో కూడా చెమటలే! చెమటను తుడిచిన చేయి టేబుల్ ఫ్యాన్ ఆన్ చేసింది. ముసలి ఫ్యాన్ కొంత అనుమానపడుతూ తిరగడం మొదలెట్టింది. గాలిని రెండు వైపులా విసిరేస్తోంది. కిటికీలోంచి ఫ్యాన్ పక్కనే—పోస్టుమాన్ చేతివేళ్ళ ముద్రల్తో వున్న ఉత్తరాన్ని తీసి, కళ్ళముందు పెట్టింది చెయ్యి. కళ్లు చదివాయి—శ్రీ యల్. విశ్వనాథం. టీచర్ యింటి. నెం............ యింకా కింది ఎడ్రసు అంతా సరిగానే వుంది. ఎవరురాశారు?

కవరు తిప్పి చూశాడు—మాలతి. ఉష్....పుట్టింటి నుంచి మాలతి. వస్తూ వస్తూ కొడుకుతోనో, బిడ్డతోనో రాబోయే మాలతి.... ఎనిమిది నెలల క్రితం నిశ్శబ్దంలో చీకట్లో—"నీకో బహుమతివ్వనా మాలా?" అన్న మాటల గుసగుస ప్రేమలోంచి—ధైర్యంగా, బహిరంగంగా తన అశక్తత మీద చెంప పెట్టులాగ తనకో చంటి బోసి నవ్వుల్ని బహుమతిగా తెస్తుంది.

పాత ఫ్యాను బుయ్ఁ- మంటున్న చప్పుడు కఠోరంగా వుంది- గాలి పడుకున్న విశ్వనాథం వెంట్రుకల కొసల మీది నుండి, నుదురు ముక్కు మీదుగా, చిరగబోతున్న షర్టులోకి చొచ్చుకుని గుండెల్ని ఉబ్బగొడుతోంది. కొద్దిగా శ్రమ తీరినట్టుంది.... గాలి జారి పోయింది! కాళ్ళ వేళ్ళ మీదుగా అలమారలో అల్యూమీనియం వంట గిన్నెలు చిన్నగా కదులుతున్నాయి. ఎంత శ్రమపడ్డా కూటికొరకే నన్న జీవిత సత్యం ఫ్యాన్ చెబుతోందా? పది క్షణాలు ఫ్యాన్ గాలి లేదు ఉక్క. ఉక్క. ఉష్షో——....తనకే స్థిరమైన ఉద్యోగం లేదు. బత కడం కష్టం. ఊళ్ళో యింటివాళ్ళ సంగతి ఎలా ఉన్నా యిక్కడ తన ప్రాణానికి మరో రెండు ప్రాణాలు. ఒక చెమట ఈజ్ ఈక్వల్ టు రెండు కడుపులు.

మాలతి యిప్పుడు కడుపుతో——అరికాళ్ళ మీదగాలి....కాళ్ళకు చుట్టేసుకున్న చంటాడు.... నన్ను అన్యాయం చేయకు. నాకో మంచి భవిష్యత్తు చూపు. నన్ను ఎదగనీయ్. పైకి లేపు- ఎత్తుకో అన్నట్లు వాడి ఏడుస్తున్న చూపు.... అవును బాగా చదివించి గొప్ప వాణ్ని చేయాలి. కేవలం తనకు పుట్టినందుకే వాడి బ్రతుకు అన్యాయమై పోవాలా?.... దండెం మీది మాలతి చీర గాలికి రెపరెప మంటోంది.... "నేనూ వున్నానండీ.... మీరు ఒప్పుకోండి. ఉద్యోగ ప్రయత్నం చేస్తాను. వేన్నీళ్ళకు చన్నీళ్లు. జీవితాలను శుభ్రంగా వుంచుదాం. మన పిల్లలు మనలాగా మురికి బతుకు బతకూడదండీ" అవునవును ఏదో చేయాలి.... సఁథింగ్ షుడ్ బి డన్....

——గాలి తిరిగి పోయింది. వంట గిన్నెల మీదికి.

వాటి అతి సన్నని శబ్దం భయంకరంగా వినిపిస్తోంది తిండి—— పెద్ద క్వశ్చన్ మార్క్. తన ఉద్యోగం——ఏ బిగ్ డాట్. ఉద్యోగ మున్నా ఏ పాటిది? నాలుగు వందల మీద సంతకం చేయించుకుని, రెండొందలిస్తారు. తను పని చేస్తున్న ప్రయివేటు స్కూలు మానేజి

మెంటోళ్ళు. రెండేళ్ళనుంచి తన గతి అంతే. పూర్తి జీతం—ఎప్పుడో రాబోయే కల. ప్రమోషన్—ఒక గాలి మేడ. తన గ్రాడ్యుయేషన్ పిల్లలకు పలక—గిలక పదాలు నేర్పేచోటే నెత్తి బాదుకుంటోంది. ఈ సమాజంలోని కుళ్ళును గూర్చి అన్యాయాల గూర్చి అవశేషాలను గూర్చి తనివితీరా విద్యార్థులకు చెప్పాలనిపిస్తుంది. వాళ్ళని మెల్లె మెల్లెగా ఎడ్యుకేట్ చేయాలనిపిస్తుంది. కాని ఆ చిన్నపిల్లల అమాయకపు చూపులు తన గొంతు నొక్కేస్తాయి.... స్లో పాయిజెనింగ్.... బి. ఎడ్ డిగ్రీలేదని పెద్ద క్లాసులకు తోలరు. కేవలం డిగ్రీలుండి పాఠాలు చెప్పలేని వాళ్ళెంత మంది?

—ఫ్యాన్ గాలి తిరిగింది. ధైర్యంలేచింది.

ఇలాంటి పరిస్థితి తనొక్కడిదే కాదు. తన లాగా చాలా మంది టీచర్లు, ఆఫీసు గుమస్తాలు, ప్యూన్‌లు, స్వీపర్లు.... చాలామంది స్థితి ఆస్కూల్లో అలాగే వుంది. మేనేజిమెంటు సెక్రటరీ మాత్రం, స్కూలు డబ్బులోంచి, ఆస్తిని ఆరోగ్యాన్ని, సంఘంలో విలువను సుతారంగా సిప్ చేస్తూ చిరునవ్వులు వెదజల్లుతుంటాడు. వాడి ఉంగరాల వేళ్ళు వాడి జీవిత వాహనపు ఏక్జిలరేటర్‌ను అతినాజూకుగా రెయిజ్ చేస్తాయి. వాడు ముందుకు దూసుకు పోతున్నాడు. తనలాంటి వాళ్ళ కెవ్వరికీ అందకుండా వేగంగా దూసుకు పోతున్నాడు. వాడి వేళ్లే, అవును వాడి వేళ్లే తనలాంటి వాళ్ళ జీవితపు పైళ్ళ. మీద అసహనంతో కాని సంత కాలు చెయ్యవు—ఆ వేళ్లే. వేళ్లే లేకుండా చేస్తే....

—రబ్బరు బెలూన్లోంచి గాలి తీసివేసిన శబ్దం లాంటిది చేస్తూ, ఫ్యాన్ మొహం తిప్పుకొంది. మళ్ళీ కొన్ని క్షణాలు గాలి లేదు.

విసుక్కున్నాడు విశ్వనాథం. గదిలో యింకా ఎవరూ లేనిది ఫ్యాన్ అటు తిరగటమెందుకూ? ఫ్యాన్‌ను తన వైపే స్థిరంగా వుండేట్లు ఎడ్జస్ట్ చేసుకుంటే.... అలోచనతో పాటు ఆచరణా జరిగి పోయింది.... యిక కళ్ళు మూసుకుని, తల తిప్పుకుని, ఊపిరి గట్టిగా

లోనికి పిల్చుకుని ధైర్యం నింపుకున్నాడు. తన తోటి వారెంతోమంది కళ్ళముందు నిలిచారు. అందరి కళ్లూ తెరుచుకునే వుంటాయి. కాని కళ్ళలో కళ్ళు తెరుచుకోవాలి. తనకు భయంలేదు. తన వెంట ధైర్యం లాగా వాళ్ళంతా వున్నారు....

—రకీమని నిశ్శబ్దం గంతేసింది. ఫ్యాన్ చప్పుడు పై రేకుల్లోంచి కురుస్తున్న అగ్గికి మాడి పోతోంది. స్థిరంగా ఒకేచోట, ఒకే బతుకును గాడిద చాకిరితో వ్యర్థం చేసుకోవడం యిష్టం లేనట్లుంది ఫ్యానుకు. గదిలో గాలి ఎండి పోతోంది.

కరంటు పోయిందా?—అనుమానం అతని తలను అటువైపు తిప్పింది.

కళ్ళు తెరిచాడు—ఫ్యాన్ సమ్మె చేసింది. విశ్వనాధం దృఢంగా లేచి నిలబడ్డాడు.

○

ప్రజాతంత్ర వారపత్రిక
24 జులై 1977